జగిత్యాలలో పోలీసు ప్రధాన కార్యాలయాన్ని మంత్రి కేటీఆర్‌తో కలిసి ప్రారంభిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ. చిత్రంలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, సుంకె రవిశంకర్ తదితరులు

జగిత్యాల జిల్లాకేంద్రం శివారులోని నూకపెల్లి కేసీఆర్‌నగర్‌లో డబుల్ బెడ్రూం ఇండ్లను హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, సుంకె రవిశంకర్ తదితరులు

కేసీఆర్ అంటే కాళేశ్వరం..

- రాష్ట్రాన్ని కాంగ్రెస్ చేతిలో పెడితే గొర్రెలకు తోడేలు కాపలా పెట్టినట్టే
- ఏది కావాలో ప్రజలే విజ్ఞతతో ఆలోచన చేయాలి: మంత్రి కేటీఆర్

కాంగ్రెస్ అంటే శనేశ్వరం

- ఆరు గ్యారెంటీలు కాదు.. వారంటీలేని పార్టీ కాంగ్రెస్
- రక్తానికి రుచిమరిగిన కాంగ్రెస్‌తో జాగ్రత్తగా ఉండాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్

కరీంనగర్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'కేసీఆర్ అంటే కాళేశ్వరం. కాంగ్రెస్ అంటే శనేశ్వరం.. మళ్లీ శనేశ్వరం కావాలా?. కాళేశ్వరం కావాలా? ఆలోచన చేయాలి' అని మంత్రి కేటీఆర్ ప్రజలకు సూచించారు. రాష్ట్రంలో సంక్షేమ పర్వం కొనసాగాలంటే కేసీఆర్ ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ రాష్ట్రం కాంగ్రెస్ చేతిలో పెడితే గొర్రెల మందకు తోడేలు కాపలా పెట్టినట్టే అవుతుందని చెప్పారు. మంగళవారం ఆయన జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో జరిగిన బహిరంగ సభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన సమావేశంలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తొమ్మిదేండ్లలో తెలంగాణలో జరిగిన అభివృద్ధి పనులను వివరిస్తూనే కాంగ్రెస్, బీజేపీ తీరుపై నిప్పులు చెరిగారు.

రేవంత్ నీకు దమ్ముందా?

కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి అనే ఒక ఆర్ఎస్ఎస్ నాయకుడిని టీపీసీసీ అధ్యక్షుడిగా చేసిందని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఈ విషయంపై పంజాబ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన డాక్టర్ అమరీందర్‌సింగ్ కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీకి రాసిన లేఖను బహిర్గతం చేశారు. ఆర్ఎస్ఎస్‌లో పనిచేసిన వ్యక్తిని తెలంగాణకు ప్రెసిడెంట్ ఎలా చేశారని అమరీందర్ సింగ్ ప్రశ్నించారని గుర్తు చేశారు. దీనికి రేవంత్ వద్ద సమాధానం ఉందా? అని ప్రశ్నించారు. ఓటుకు నోటు దొంగను.. పార్టీ ప్రెసిడెంట్‌గా పెట్టుకున్నారని, ఇక్కడి నక్క జిత్తుల కాంగ్రెస్ వాళ్లు ఎన్ని మాటలు మాట్లాడినా పొరపాటున కూడా నమ్మొద్దని కోరారు.

మోదీ ఏ హామీనీ నెరవేర్చలేదు..

బీజేపీకి-బీఆర్ఎస్‌కు సంబంధం ఉందంటూ బదనాంచేసే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. ప్రధాని మోదీని సీఎం కేసీఆర్ విమర్శించినంతగా ఈ దేశంలో ఏ ఒక్క పార్టీవోడైనా మాట్లాడాడా? అనేది ప్రజలు ఆలోచించాలని కోరారు. మోదీ ఎన్నికలప్పుడు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు.

రాజన్నసిరిసిల్ల జిల్లాలో డబుల్ బెడ్రూం ఇల్లు వచ్చిన ఆనందంలో మంత్రి కేటీఆర్‌ను హత్తుకొని భావోద్వేగానికి గురవుతున్న లబ్ధిదారు మాచపత్రి రాజేశ్వరి

4.25 లక్షల మంది బీడీ కార్మికులకు పింఛన్

> దేశంలోనే మొదటిసారిగా 4.25 లక్షల మంది బీడీ కార్మికులకు పింఛన్ ఇస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ మాత్రమేనని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఇది వరకు కాంగ్రెస్, బీజేపీకి ఈ ఆలోచన ఎందుకు రాలేదు? అని ప్రశ్నించారు. దేశంలోని 16 రాష్ట్రాల్లో బీడీలు చుట్టే అక్కా చెల్లెళ్లు, టేకేదార్లుంటే ఎవరైనా పట్టించుకున్నారా? అనేది ఆలోచించాలని కోరారు. షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి లాంటి పథకాలు ఇవ్వాలని గతంలో పాలించిన ప్రభుత్వాలకు ఎందుకు అనిపించలేదో చెప్పాలని అన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు రూ.200 పింఛన్ ఇచ్చినోళ్లు.. ఇప్పుడు రూ.4వేలు ఇస్తామని నమ్మబలుకుతున్నారని.. ఇలాంటి దొంగ పార్టీలపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రైతు బంధు, ఆసరా పింఛన్లు పొందుతున్నవారు బీఆర్ఎస్‌కు ఓటేస్తే ఇతర పార్టీల డిపాజిట్లు గల్లంతవుతాయని తెలిపారు.

వారంటీలేని పార్టీ కాంగ్రెస్!

60 ఏండ్లు మనల్ని పాలించిన కాంగ్రెస్ కనీసం తాగు, సాగు నీరు కూడా ఇవ్వలేదని కేటీఆర్ మండిపడ్డారు. 150 ఏళ్ల కిందట పుట్టిన కాంగ్రెస్ వారంటీ పూర్తయిందని, ఆ పార్టీ గ్యారెంటీలను నమ్ముతారా? అని ప్రజలను ప్రశ్నించారు. దేశానికి ఒక పార్టీ మొండిచెయ్యి చూపితే.. మరో పార్టీ చెవిలో పువ్వులు పెడుతున్నదని, కాంగ్రెస్, బీజేపీ రెండూ దేశాభివృద్ధిని విస్మరించిన పార్టీలేనని దుయ్యబట్టారు. మూడు గంటల కరెంట్ కావాలనుకొనే వారు కాంగ్రెస్‌కు ఓటేయాలని.. 24 గంటల కరెంట్ ఉండాలని అనుకునేవాళ్లు కారు గుర్తుకు ఓటేయాలని కోరారు.

బీజేపీకి భారీ షాక్

వేములవాడలో బీజేపీకి భారీ షాక్ తగిలింది. వేములవాడ రూరల్ ఎంపీపీ బండ మల్లేశ్‌యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గోపు బాలరాజు బీజేపీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహరావు ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బైపాస్‌రోడ్డులోని హెలిప్యాడ్ వద్ద వారికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు.

70 వేల ఓట్ల మెజార్టీతో సంజయ్‌ని గెలిపించాలి..

''మంచి మనిషి.. మీ అందరి తలలో నాలుకలా ఉండే డాక్టర్ సంజయ్‌ను వచ్చే ఎన్నికల్లో 70 వేల మెజార్టీతో గెలిపించాలి' అని మంత్రి కేటీఆర్ జగిత్యాల ప్రజలను కోరారు. పెద్ద పెద్ద పరిశ్రమలు.. అండర్ గ్రౌండ్ డ్రేనేజీని తెచ్చుకొని.. జగిత్యాలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. డబుల్ బెడ్రూంలకు సంబంధించి ఎమ్మెల్యే సంజయ్ మరో రూ.50 కోట్లు అడిగారని, తద్వారా మరో 1200 మందికి ఇండ్లు వస్తాయని చెప్పారని అన్నారు. మంచి మెజార్టీతో గెలిపిస్తే అందరికీ ఇండ్లు ఇప్పించే బాధ్యతను తాను తీసుకుంటానని తెలిపారు. జగిత్యాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా పట్టణ ప్రణాళిక తీసుకొచ్చే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. డాక్టర్‌గా సంజయ్ ఒకవైపు ప్రభుత్వ కార్యక్రమాలు అమలుచేస్తూనే.. మరోవైపు వైద్య వృత్తి ద్వారా వేలాది మందికి కంటి ఆపరేషన్లు చేసి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు.

తెలంగాణ బిడ్డలను బలితీసుకున్నది కాంగ్రెస్సే

'ఆరు దశాబ్దాలు సావగొట్టడమేకాదు. 1956లో తెలంగాణకు, ఆంధ్రాకు ఇష్టంలేని బలవంతపు పెండ్లి చేసి మోసం చేసింది కాంగ్రెస్సే. 1968లో 370 మంది పిల్లలను కాల్చి చంపింది కాంగ్రెస్సే. 2004లో మాటిచ్చి 2014 వరకు సావగొట్టి, 1200 మంది తెలంగాణ బిడ్డల సావులకు కారణమైంది కాంగ్రెస్ పార్టీనే' అని మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇవాళ మళ్లీ వచ్చి ఒక్క చాన్స్ ఇవ్వాలని అడుగుతున్నరు..కపట కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దు అని ప్రజలకు సూచించారు.

రైతులకు అండగా బీఆర్ఎస్ సర్కార్

రైతులకు అడుగడుగునా అండగా నిలుస్తున్న సీఎం కేసీఆర్.. వెయ్యికోట్లు ఖర్చుపెట్టి ఎస్సారెస్పీ రివర్స్ పంపింగ్ ద్వారా వరదకాలువను సజీవధారగా మార్చారని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. గతంలో నీటి యుద్ధాలు కనిపించే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇప్పుడు అన్ని వైపులా జలధారలు కనిపిస్తున్నాయని తెలిపారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో 1001 గురుకులాలు ఏర్పాటుచేసి అందులో 6.50 లక్షల మంది విద్యార్థులకు చదువును అందిస్తున్నది కాంగ్రెస్ వాళ్లకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు.

గుడిసేలేని నియోజకవర్గంగా సిరిసిల్ల

తెలంగాణలోనే గుడిసే లేని నియోజకవర్గంగా సిరిసిల్లను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకుపోతున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. అందులో భాగంగానే 1,747 మందికి గృహలక్ష్మి పథకం కింద ఇండ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలోనే ఇది తొలి ప్రయోగమని, డబుల్‌బెడ్రూం ఇండ్లు, గృహలక్ష్మి లబ్ధిదారులుపోనూ ఇంకా మిగిలి ఉన్న వారందరికోసం సీఎం కేసీఆర్ కాళ్లు మొక్కి అయినా మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కాళేశ్వరం ప్యాకేజీ-9లో భాగంగా కోనరావుపేట మండలంలో నిర్మించిన మల్కపేట రిజర్వాయర్‌ను వారంలోగా సీఎం కేసీఆర్ చేతులమీదుగా ప్రారంభించనున్నట్టు చెప్పారు. సమైక్య రాష్ట్రంలో సిరిసిల్ల ఎట్లుండే, స్వరాష్ట్రంలో తొమ్మిదిన్నరేండ్లలో ఎంత తెలివైందో తీరిగ్గా ఆలోచించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలే కేంద్ర బిందువుగా తొమ్మిదిన్నరేండ్లుగా పాలన సాగిస్తున్నట్టు చెప్పారు. 'మీరు దీవిస్తే మంత్రి నయ్యా. నేను చేసిన అభివృద్ధిని చూసి మళ్లీ ఆశీర్వదించండి' అని ప్రజలను కోరారు.

ధర్మపురి ధర్మరాజు కొప్పుల

మంత్రి కొప్పుల ఈశ్వర్ ధర్మపరి ధర్మరాజు అని, నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. రాజకీయ రంగంలో కొప్పుల అంత సౌమ్యులు ఉండరని అభినందించారు. సమైక్య రాష్ట్రంలో ధర్మపురి నియోజకవర్గంలో 40 వేల ఎకరాలు మాత్రమే సాగు కాగా.. ముఖ్యమంత్రిని ఒప్పించి 13 ఎత్తిపోతల పథకాలు సాధించి అమలు చేయడంవల్ల సాగు విస్తీర్ణం ప్రస్తుతం 1.26 లక్షలకు పెరగడం కొప్పులకు ధర్మపురి నియోజవర్గంపై ఉన్న ప్రేమకు నిదర్శనమని పేర్కొన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. కేసీఆర్‌కు అన్నిరంగాల్లో తమ్ముడిగా ఉంటూ.. గెలుపోటములను సమానంగా తీసుకుంటూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పాటుపడే ఈశ్వర్‌ను వచ్చే ఎన్నికల్లో 60 వేల నుంచి 70 వేల మెజార్టీతో గెలిపించాలని కోరారు. ధర్మపురి ప్రజల్లో ధర్మం ఉంటే.. ధర్మరాజులాంటి ఈశ్వర్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

లోకం పోకడ



టీఎస్ఈఆర్సీ అడ్వైజరీ మెంబర్‌గా శశిభూషణ్‌కాచే

మంథని, అక్టోబర్ 3: తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ) సలహా కమిటీ సభ్యుడిగా మంథనికి చెందిన న్యాయవాది, రైతు నేత శశిభూషణ్ కాచే నియమితులయ్యారు. ఈ మేరకు కమిషన్ చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ రంగాలకు చెందిన 13 మందితో కమిటీని పునర్ వ్యవస్థీకరిస్తూ సెప్టెంబర్ 8న గెజిట్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ మూడేండ్ల పాటు కొనసాగనున్నది. తన నియామకానికి సహకరించిన చైర్మన్ తన్నీరు శ్రీరంగారావుకు కాచే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వర్షకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	37.2°c	23.8°c
నల్లగొండ	36.7°c	23.0°c
ఖమ్మం	35.0°c	23.0°c
వరంగల్	33.0°c	25.0°c
రంగారెడ్డి	32.9°c	21.9°c
మెదక్	32.5°c	22.6°c
కరీంనగర్	32.0°c	24.0°c
నిజామాబాద్	31.9 °c	24.3°c
హైదరాబాద్	30.7°c	23.7°c
మహబూబ్‌నగర్	29.4°c	24.1°c

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

జేఎన్‌టీయూహెచ్‌లో..

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూహెచ్)లో కాంట్రాక్టు/తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- పోస్టులు: అకడమిక్ అసిస్టెంట్, అసిస్టెంట్ ప్రొఫెసర్
- స్పెషలైజేషన్లు: మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మెకానికల్, ఇంగ్లిష్, సీఎస్ఈ తదితరాలు
- దరఖాస్తు: ఈ-మెయిల్ ద్వారా
- చివరితేదీ: అక్టోబర్ 9
- వెబ్‌సైట్: https://www.jntuh.ac.in

ఎన్‌బీఈఎంఎస్‌లో..

నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు:48
- పోస్టులు: డిప్యూటీ డైరెక్టర్, లా ఆఫీసర్, జూనియర్ ప్రోగ్రామర్, జూనియర్ అకౌంటెంట్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: అక్టోబర్ 20
- వెబ్‌సైట్: https://www.natboard.edu.in

పేపర్ మిల్‌లో..

సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలోని సెక్యూరిటీ పేపర్ మిల్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 9
- పోస్టులు: సూపర్‌వైజర్, జేహెచ్‌టీ, సెక్రటేరియల్ అసిస్టెంట్
- విభాగాలు: ఎలక్ట్రికల్/ప్రొడక్షన్, ల్యాబ్, స్టోర్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: అక్టోబర్ 29
- వెబ్‌సైట్: https://spmnarmadapuram.spmcil.com

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- గ్రూప్స్ ప్రత్యేకం చరిత్ర, పాలిటీ, జనరల్ ఎస్సే కోసం పైన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

ప్రధానివన్నీ అబద్ధాలే

మొదటిపేజీ తరువాయి...

సీఎం కేసీఆర్ ప్రయ్నతించారని మంగళవారం ఇందూరు బహిరంగసభలో ప్రధాన మోదీ చేసిన ఆరోపణలను మంత్రి కేటీఆర్ ఖండించారు. ఆయన హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ప్రధాని కొంత హుందాగా వ్యవహరించాల్సి ఉన్నదని అన్నారు. 70 ఏండ్లకుపైగా వయసున్న వ్యక్తి, అంత పెద్ద పదవిలో ఉండి ఇలా మాట్లాడటం సముచితంకాదని తెలిపారు. జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత జరిగిన విషయాన్ని ఇన్నిరోజుల తర్వాత ఎందుకు ప్రధాని మాట్లాడారని విలేకరులు ప్రశ్నించగా, ఆ విషయం మీరు ఆయన్నే అడగాలని సూచించారు. ఎన్డీయేలో చేరుతానని కేసీఆర్ తనను కలిసినట్టు ప్రధాని పేర్కొనడంపై స్పందిస్తూ, దేశంలోనే రెండు అతిపెద్ద రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వ్యక్తులు జరిపిన చర్చలను.. అందులో ఒక వ్యక్తి బయటకు వచ్చి తనకు అనుకూలంగా చెప్పుకోవడం, మాట్లాడని విషయాలను మాట్లాడినట్టు చెప్పడం విచారకరమని పేర్కొన్నారు.

తెలంగాణకు మోదీ చేసిందేమీ లేదు..

ఎన్డీయేనుంచి జేడీయూ, శివసేన, టీడీపీ, శిరోమణి అకాలీదళ్‌లాంటి పార్టీలు బయటకువచ్చి ఇప్పుడు ఎంతో ఆనందంగా ఉన్నాయని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. తొమ్మిదేండ్లలో మోదీ తెలంగాణకు చేసిందేమీ లేదని, ఒక్క మెడికల్ కాలేజీ, ఒక్క నర్సింగ్ కాలేజీ, ఒక్క విద్యాసంస్థను కానీ మంజూరు చేయలేదని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి చెందిన ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వలేదని మండిపడ్డారు. తెలంగాణ యువత ఎంతో తెలివైన వారు అంటూనే.. ఇక్కడ ఏర్పాటు చేయాల్సిన ఐటీ ఐఆర్‌ను రద్దుచేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణకు అనేక విధాలుగా మోదీ అన్యాయం చేశారని మండిపడ్డారు. కేంద్రం నుంచి ఇచ్చిన నిధులతోనే తెలంగాణ అభివృద్ధి చెందుతున్నదనడం సత్యదూరమని, తెలంగాణ దేశ జీడీపీలో నాలుగో అతిపెద్ద రాష్ట్రమని, ఇక్కడినుంచి కేంద్రానికి రూపాయి వెళ్తే, అందులో 46 పైసలు మాత్రమే రాష్ట్రానికి తిరిగొస్తున్నాయని చెప్పారు.

పసుపు బోర్డు ఓ జోక్!

పసుపు బోర్డు అనేది ఒక జోక్ అని, తొమ్మిదేండ్లుగా ఖాళీగా ఉండి ఇప్పుడు బోర్డు ఇస్తామంటూ మాట్లాడమేంటని కేటీఆర్ ప్రశ్నించారు. ఏ రాష్ట్రానికి పోయినా అక్కడి సీఎంను అవినీతిపరులని విమర్శించడం మోదీకి అలవాటుగా మారిందని పేర్కొన్నారు. బెంగాల్, ఒడిశా, మేఘాలయ తదితర సీఎంలను ఇలాగే విమర్శించారని గుర్తుచేశారు. అనంతరం కొద్దిరోజుల్లోనే మేఘాలయ ప్రభుత్వంలో బీజేపీ చేరిందని చెప్పారు. 'ఆయనతో ఉంటే అంతా మంచివారే. ప్రకాశ్‌సింగ్ బాదల్, ఆయన కుమారుడు సుక్బీర్‌సింగ్ బాదల్ ఎన్డీయేలో ఉన్నప్పుడు రాజులు, యువరాజులు అనే విషయం మోదీకి గుర్తుకురాలేదు. ముఫ్తీమొహమ్మద్ సయీద్ కూతురు మెహబూబా ముఫ్తీతో పొత్తు పెట్టుకున్నప్పుడు గుర్తుకురాలేదు. ఏపీలో చంద్రబాబునాయుడు సీఎంగా, ఆయన కొడుకు మంత్రిగా ఉన్నప్పుడు వారు ఎన్డీయేలో ఉంటే అప్పుడు కూడా గుర్తుకురాలేదు. బాల్‌ఠాక్రే, ఆయన కొడుకు ఎన్డీయేలో ఉన్నప్పుడు ఇవేవీ గుర్తుకురావు' అని మంత్రి కేటీఆర్ మోదీనుద్దేశించి వ్యాఖ్యానించారు.

ఎన్డీయేలో మిగిలింది సీబీఐ, ఐటీ మాత్రమే!

సీబీఐ, ఐటీ తప్ప మిగిలిన మిత్రపక్షాలన్నీ ఎన్డీయేని వదిలి వెళ్లిపోయాయని మంత్రి కేటీఆర్ చురకలంటించారు. పదేపదే కుటుంబ రాజకీయాల గురించి మాట్లాడుతారని, అనురాగ్ ఠాకూర్, జ్యోతిరాధిత్య సింధియా, జై షా ఎవరని ప్రశ్నించారు. తనను సీఎం చేసేందుకు కేసీఆర్ మోదీని అడిగినట్టు చెబుతున్నారని, ఎవరిని సీఎంగా చేయాలో తమ పార్టీ నిర్ణయిస్తుందని, ఇతరుల అనుమతి అడగాల్సిన అవసరం బీఆర్ఎస్‌కు పట్టలేదని చెప్పారు. తెలంగాణ ప్రజానీకం కేసీఆర్‌ను మూడోసారి సీఎంను చేసేందుకు సిద్ధంగా ఉన్నదని తెలిపారు. గత ఎన్నికల్లో బీజేపీ 105 స్థానాల్లో డిపాజిట్ కోల్పోయిందని, ఈసారి 110 స్థానాల్లో డిపాజిట్లు గల్లంతవుతాయని చెప్పారు. ఈసారి ఆ పార్టీకి ఒక్క ఎంపీ స్థానం కూడా రాదని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు.

మలిసంధ్యలో మద్దతుగా!

వృద్ధుల సంక్షేమంలో తెలంగాణ టాప్

- పింఛన్లతో ఆదుకుంటున్న ప్రభుత్వం
- అన్ని విధాలుగా అండగా సీఎం కేసీఆర్
- వృద్ధుల కోసం ప్రత్యేకంగా హెల్ప్‌లైన్
- గడప ముంగిటికి సాధారణ వైద్యసేవలు
- పకడ్బందీగా మెయింటెనెన్స్ యాక్ట్

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): వయోవృద్ధుల సంక్షేమంలో తెలంగాణ సర్కారు దేశానికే దిక్సూచిగా నిలుస్తున్నది. ఆసరా పథకం ద్వారా మరెక్కడా లేనివిధంగా రూ.2016 పింఛన్‌ను అందిస్తూ మలి దశలో ఆర్థిక బరోసా అందిస్తున్నది. వారికోసం దేశంలోనే తొలిసారి 14567తో హెల్ప్‌లైన్ సేవలు ప్రారంభించింది. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమచట్టం(2007)ను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నది. వయోవృద్ధుల సమస్యల సత్వర పరిష్కారం కోసం వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించింది. తొలుత ప్రయోగాత్మకంగా దీనిని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నది. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నది. రాష్ట్రంలో ప్రస్తుతం 16,44,280 మందికి ఆసరా పింఛన్లు అందిస్తున్న ప్రభుత్వం గత 9 ఏండ్లలో రూ.18,555 కోట్లు చెల్లించింది.

హెల్ప్‌లైన్‌కు 1.33 లక్షల కాల్స్

వృద్ధుల సమస్యల తక్షణ పరిష్కారానికి దేశంలోనే తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం 14567 నంబరుపై హెల్ప్‌లైన్ సేవలు ప్రారంభించింది. 2019లో తొలుత జీహెచ్ఎంసీ పరిధిలో హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ఈ సేవలను ప్రవేశపెట్టింది. విశేష స్పందన రావడంతో అక్టోబర్ 2020లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి సమర్థంగా నిర్వహిస్తున్నది. ఇప్పటి వరకు ఈ హెల్ప్‌లైన్‌కు 1.33 లక్షల మంది కాల్ చేసి సమస్యలు చెప్పుకోగా అన్నింటినీ పరిష్కరించింది.

పింఛన్‌లో మానవీయకోణం

> ఆసరా పింఛన్ల పంపిణీని ప్రభుత్వం మానవీయ కోణంలో చూస్తున్నది. చాలా రాష్ట్రాలు గ్రామీణ ప్రాంతాల్లో రూ. 60 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 75 వేల వార్షిక ఆదాయం మించితే పింఛన్లకు అనర్హులుగా ప్రటిస్తున్నాయి. కేసీఆర్ సర్కారు మాత్రం దేశంలో ఎక్కడా లేనివిధంగా గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షలకు ఆదాయ పరిమితిని పెంచింది. పింఛన్ అర్హత వయసు చాలా రాష్ట్రాల్లో 60-65 ఏళ్లు ఉండగా, మన రాష్ట్రంలో మాత్రం 57గా ఉంది.

ఆస్తుల వాపస్

తెలంగాణ మెయింటనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ చట్టం 2011లో కీలక మార్పులు చేసిన ప్రభుత్వం.. తమ సంరక్షణను పట్టించుకోని పిల్లల నుంచి ఆస్తులు వెనక్కి తీసుకునేలా చట్టాన్ని సవరించింది. పిల్లల ఆదాయం పెరిగితే ఆ మేరకు తమకూ జీవనభృతిని పెంచేలా కోరుతూ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించేలా నిబంధనలు మార్చింది. బాధిత వృద్ధుల నుంచి ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రత్యేకంగా www. tsseniorciti zens. cgg.gov.inను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రతి జిల్లాకు 50 నుంచి 100 పడకలతో అన్ని వసతులతో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేస్తున్నది. తొలివిడతలో 12జిల్లాలకు వృద్ధాశ్రమాలను మంజూరు చేసింది. ఒక్కో వృద్ధాశ్రమానికి రూ. 50 లక్షలు కేటాయించింది.ఇప్పటికే రాజన్నసిరిసిల్లా, సిద్దిపేట, నారాయణపేట, సంగారెడ్డి జిల్లాలో వృద్ధాశ్రమాలు అందుబాటులోకి వచ్చాయి.

మొబైల్ మెడికేర్ సేవలు

మొబైల్ మెడికేర్ యూనిట్ సేవల కోసం రెడ్ క్రాస్ సొసైటీతో ప్రభుత్వం చేతులు కలిపింది. తొలి విడతగా 15జిల్లాల్లో 17వాహనాలతో ప్రయోగాత్మకంగా ఈ ఏడాది జూలైలో శ్రీకారం చుట్టింది. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 2 చొప్పున, భద్రాచలం, హన్మకొండ, హైదరాబాద్, జగిత్యాల, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి, సంగారెడ్డి, నల్లగొండ, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఒక్కో వాహనం ద్వారా సేవలను అందిస్తున్నది. ప్రతి జిల్లాలో 70-100 క్యాంపులతో 5 వేల మంది వృద్ధులకు వైద్యసేవలను అందిస్తున్నది.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

వృద్ధుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. వాటిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి. ప్రభుత్వం అందిస్తున్న హెల్ప్‌లైన్ సేవలు, మొబైల్ మెడికేర్ యూనిట్లు, ఆన్‌లైన్ సేవలు, ఓల్డ్ ఏజ్ హోమ్స్ తదితర వాటిని సద్వినియోగం చేసుకోవాలి. ఎవరి నుంచైనా వేధింపులు ఎదురైతే వెంటనే సమాచారం అందించాలి. వృద్ధులను ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు.

-సైలజ, కమిషనర్, దివ్యాంగులు, వయోవృద్ధులు, లింగమార్పిడి వ్యక్తుల సాధికారతశాఖ